సాక్షి
జనగామ

బుధవారం । 1 । జనవరి । 2025



అట్టహాసంగా అథ్లెటిక్స్ క్రీడోత్సవాలు

హనుమకొండలోని జేఎన్ఎస్‌లో సీఎం కప్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్, రెజ్లింగ్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.

- 8లో▸



వినూత్న నిరసన

సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం ఉద్యోగులు తాళ్లతో చేతులను కట్టేసుకుని నిరసన వ్యక్తం చేశారు.


- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $28^0/16^0$

జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

ఉద్యోగమే మొదటి ప్రాధాన్యం



నయా సాల్ నయా సోచ్..

- ఈ ఏడాది కొలువు సాధిస్తామంటున్న యువత
- మంచి కోసమే సోషల్ మీడియా వినియోగం
- గతం కంటే మద్యపానం తగ్గిస్తాం
- 'సాక్షి' సర్వేలో పలువురి వెల్లడి




కొత్త సంవత్సరంలో కొత్తగా ఉండాలని కాంక్షించడమే కాదు.. గట్టి నిర్ణయం తీసుకుంటామని యువత చెబుతోంది. నయా సాల్ నయా సోచ్ అంటూ తమ అభిప్రాయాన్ని పంచుకుంటున్నారు. పాత అలవాట్లకు కొంత స్వస్తి చెప్పడమే కాకుండా ఆరోగ్యం పెంచుకోవడం, ఉద్యోగమే లక్ష్యంగా ముందుకు సాగుతామని చెబుతున్నారు. 2024 సంవత్సరం ముగిసి 2025 ఏడాదిలోకి అడుగుపెట్టాం. ఈ నేపథ్యంలో గత ఏడాదిలో మంచిచెడులు, నేర్చుకున్న పాఠాలు, కొత్త సంవత్సరంలో నిర్దేశించుకోవాల్సిన లక్ష్యాలపై 'సాక్షి' బృందం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 500 మందిని సర్వే చేసింది. వీరిలో చదువు ముగిసిన వారు ఎక్కువ మంది ఈ ఏడాది ఉద్యోగ సాధనే మా టార్గెట్ అంటూ చెప్పుకొచ్చారు. మద్యపాన విషయంలో పూర్తిగా మానేస్తామనే వారికంటే గతం కంటే తగ్గిస్తామని ఎక్కువ మంది తెలిపారు. **- సాక్షి బృందం**

ఉద్యోగం సాధించడమే లక్ష్యం..



కొత్త సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన అనంతరం ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం. ఇందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగేందుకు నిర్ణయం తీసుకుంటా. సోషల్ మీడియాను ఫాలో అయ్యే సమయాన్ని తగ్గించి ఉద్యోగాన్ని సాధించేందుకు ఉపయోగపడే మెటీరియల్స్‌ను చదువుకుంటా.

- సిలువేరు క్రాంతిరణదేవ్, డిగ్రీ విద్యార్థి





'కొత్త' కలలు కందామా..కల అంటే నిద్రలో వచ్చేది కాదు. నిద్రపోనివ్వకుండా చేసేది. కలలు కనండి. వాటిని సాకారం చేసుకోండి.


- మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం

కుంచిత భావన మనసుకే కానీ.. ఊహకు కాదు.. కాస్త పెద్ద కలలు కందాం. 'నేస్తమా.. బిగ్ డ్రీమ్'..

- ప్రముఖ రచయిత జిడ్డు కృష్ణమూర్తి

అందరి జీవితంలోనూ న్యూ ఇయర్ వస్తుంది. కొందరేమో కొత్త అలవాట్లతో ముందుకెళ్తారు. మరికొందరేమో రొటీన్ జీవితానికే అలవాటు పడతారు. కొత్త కలలు మిమ్మల్ని విజయానికి దగ్గర చేస్తాయి. మీకు సరికొత్త ఉత్సాహాన్నిస్తాయి. మీ అలవాట్లలో స్వల్ప మార్పులు మిమ్మల్ని అందరిలో ప్రత్యేకంగా నిలబెడతాయి. 2025 లో ఈ 5 సూత్రాలు పాటిస్తే ఉన్నత శిఖరాలకు చేరొచ్చని మానసిక వికాస నిపుణులు అంటున్నారు.

- సాక్షి ప్రతినిధి, వరంగల్/ హన్మకొండ కల్చరల్



'కొత్త' కలలు.. సరికొత్త అడుగులు

నూతన సంవత్సరం.. ఆనంద జీవితం

- విజయానికి పంచ సూత్రాలు
- ఉద్యోగం, ఉపాధితో మెరుగైన జీవనం
- ముందస్తు అప్రమత్తతతో సైబర్ మోసాలకు దూరం
- పాత జ్ఞాపకాలను మరిచి కొత్త ఆశయాలతో ముందుకు..

బైబై 2024- వెల్‌కమ్ -2025

కొత్త కలలు కందాం. సరికొత్తగా అడుగులు వేద్దాం. ఇన్నాళ్లు ఒక లెక్క. ఇకపై ఒక లెక్క. నువ్వేంటో నిరూపించుకునే రోజొకటి రానే వచ్చింది. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ.. అందరికీ విష్ చేయడం కాదు. నీ జీవితంలో ఎంత హ్యాపీ నెస్ ఉందో ఆత్మపరిశీలన చేసుకో. జీవితంలో ఆనందం నిండాలంటే.. నీ విలువ పెంచుకోవాలి. అందుకే 'లెర్నింగ్ ఈజ్ ఎర్నింగ్' అన్నారు. ఎంత నేర్చుకుంటే అంత సంపాదిస్తావ్. కొత్త అలవాట్లు నిన్ను సరికొత్తగా చూపిస్తాయ్.

ఆరోగ్యమే ఆనంద యోగం..



మిమ్మల్ని నడిపే సిస్టం ఒకటి మీలోనే ఉంటుంది. అదే ఆరోగ్యం. రోజులో కొంత సమయాన్ని దాని కోసం కేటాయిస్తే.. రోజంతా మీరేపని చేసినా రెట్టింపు ఫలితం వస్తుంది. ఉదయాన్నే వాకింగ్ లేదా రన్నింగ్‌కు వెళ్లారనుకోండి.. రోజంతా తేలికగా అనిపిస్తుంది. రోజులో కనీసం పావుగంట మీకిష్టమైన మ్యూజిక్ వినడం, మెడిటేషన్, యోగా వంటివి సాధన చేస్తే రోజంతా హాయిగా గడుస్తుంది. ఏపని మీదైనా శ్రద్ధ పెట్టగలుగుతారు. 'రోజూ అరగంట సేపు ఆరోగ్యం కోసం కేటాయిస్తే జీవితంలో డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరమే ఉండదు' అని ఇటీవల అమెరికాలోని ఓ యూనివర్సిటీ నిర్వహించిన సర్వేలో వెల్లడించారు.

ఉద్యోగమే ఉన్నతికి మార్గం



పొరుగు దేశాల్లో బాల్యదశ నుంచే పార్ట్ టైం జాబ్‌లు చేస్తారు. తల్లిదండ్రుల మీద ఆధారపడకుండా తమ కాళ్ల మీద తాము నిలబడాలని.. చిన్నా చితకా పనులు చేసి సంపాదిస్తారు. ప్రపంచ కుబేరుడు వారెన్ బఫెట్ కూడా చిన్నతనంలో ఇళ్లు.. ఇళ్లు తిరిగి చూయింగ్ గమ్స్, కొకాకోలా అమ్మేవాడు. ఇలా.. కోట్లు కూడబెట్టిన వాళ్లైనా.. జీవితంలో స్థిర పడ్డవారైనా చిన్నతనం నుంచే పని చేయడం ప్రారంభించారు. డిగ్రీలు, పీజీలు చేసి సరైన ఉద్యోగం లేక ఎంతో మంది ఖాళీగా ఉంటున్నారు. ఉద్యోగమంటే బానిసత్వం కాదు. ఉన్నతికి మార్గం. చిన్నదో పెద్దదో దొరికితే ఉద్యోగం లేదంటే వ్యాపారం.. ఏదో ఒక పనిచేస్తే పేదరికాన్ని పారదోలవచ్చు.

పర్యావరణమే మనుగడకు మూలం



'పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత' అక్కడక్కడా ఈ నినాదం చూస్తూ ఉంటాం. మీరో మొక్క నాటకపోయినా పర్లేదు. 'పర్యావరణాన్ని కాపాడండి' అంటూ ప్రచారం చేయకపోయినా పర్లేదు. మరింత కలుషితం చేయకుండా ఉంటే చాలు. సిగరేట్లు తాగడం, ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగించి పడేయడం. విచ్చలవిడిగా పాలిథిన్ వినియోగించడం. ఇలాంటివి చేయకుండా ఉంటే పర్యావరణానికి మేలు చేసినవారే.

అతినే ప్రమాదానికి కారణం



కరోనా సమయంలో కేవలం యూట్యూబ్‌లో వీడియోలు చూసి, ఆన్‌లైన్‌లో క్లాస్‌లు విని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అయిన వారు ఉన్నారు. రీల్స్ స్క్రోల్ చేస్తూ సమయాన్ని హరించిన వారూ ఉన్నారు. విజేతలకు, పరాజితులకు ఎవరికైనా సోషల్ మీడియా ఒకటే. ఎవరు ఎలా వాడుకుంటే అలా ఉపయోగపడుతుంది. అరచేతిలో ఇమిడే పరిజ్ఞానాన్ని మీఉన్నతికి ఉపయోగిస్తే ఉన్నతులుగా తయారవుతారు.

దురాశే దుఃఖానికి తీరం



గ్రేటర్ వరంగల్ నగరంలో సైబర్ వలలో చిక్కిన వారిలో దాదాపు 90 శాతం మంది యువకులే. వారి అత్యాశను క్యాష్ చేసుకుంటున్నారు సైబర్ నేరగాళ్లు. స్టాక్ మార్కెట్ అని ఒకరు. రూపాయి పెడితే పది రూపాయలొస్తుందని మరొకరు. తెలియని లింకులు నొక్కి ఇంకొకరు ఇలా నిత్యం నష్టపోతూనే ఉన్నారు. టెక్నాలజీ వాడకంతో పాటు అందులో వస్తున్న విపరీతమైన పోకడలను సైతం యువత ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. మోసపోకుండా జాగ్రత్త పడాలి.

'పది' ఫలితాలపై ప్రత్యేక దృష్టి

- జనవరి చివరి కల్లా ఇందిరమ్మ ఇళ్ల జాబితా
- సాక్షి ఇంటర్వ్యూలో కలెక్టర్ రిజ్వాన్ బాషా



జనగామ: నూతన సంవత్సరంలో పదవ తరగతి వార్షిక ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ.. రాష్ట్రంలోనే మంచి ర్యాంకు సాధించే దిశగా అడుగులు వేస్తామని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. కొత్త సంవత్సరం పురస్కరించుకుని సాక్షి ఇంటర్వ్యూలో కలెక్టర్ మాట్లాడారు. పది విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు విజయోస్తు ప్రోగ్రాంకు శ్రీకారం చుట్టామని, కొత్త సంవత్సరంలో స్పెషల్ తరగతులు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో అమలు చేస్తున్న భోజన పథకంపై పర్యవేక్షణ పెంచడంతో పాటు భోజనం నాణ్యత విషయంలో ఖచ్చితత్వంతో ఉంటాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే అర్హుల ఇళ్లకు సంబంధించి గ్రౌండింగ్ పూర్తి చేసుకుని, పంచాయతీ ఎన్నికల ముందుగానే బేస్‌మెంట్ వరకు ఇళ్ల నిర్మాణ పనులు జరిగేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తాం. కొత్త పింఛన్లు, రైతు భరోసాకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా, గైడ్‌లైన్స్ రాగానే, ఎలా ఇంప్లిమెంట్ చేయాలనే దానిపై కసరత్తు చేస్తాం. ప్రభుత్వం సంకల్పించిన విధంగా భూ భారతిని నిబంధనల మేరకు అమలు చేస్తామన్నారు.

ఆర్టీసీ ఉత్తములకు సత్కారం



ప్రశంసా పత్రాలతో ఉద్యోగులు

జనగామ: జనగామ ఆర్టీసీలో అంకితభావంతో పని చేస్తూ సంస్థకు పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన ఉద్యోగులను మంగళవారం డిపో ఆవరణలో మేనేజర్ ఎస్.స్వాతి సత్కరించారు. నవంబర్–2024 మాసంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 23 మంది కండక్టర్లు, డ్రైవర్లు, మెయింటెనెన్స్ విభాగంలో పని చేస్తున్న వారికి ప్రగతి చక్ర అవార్డులను అందించారు. అలాగే డిపో పరిధిలో (నవంబర్–2024) ఆరుగురు కండక్టర్లు, ముగ్గురు టిమ్ డ్రైవర్లు, ఇందన పొదుపు చేసిన ముగ్గురు డ్రైవర్లకు డిపో మేనేజర్ చేతుల మీదుగా నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అవార్డు గ్రహీతలు, ఆఫీస్ సిబ్బంది, గ్యారేజ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

'పెన్షనర్లను ఇబ్బందులకు గురిచేయొద్దు'

దిల్వార్పు: ప్రభుత్వ ఉద్యోగులుగా పదవీ విరమణ పొందిన పెన్షనర్లను ఇబ్బందులు గురిచేయొద్దని, అలా చేస్తే తగిన గుణపాఠం చెబుతామని 2024 పెన్షనర్ల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఇనుగాల ఇంద్రసేనారెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ 10 నెలలు గడిచినా పెన్షనర్ల పెండింగ్ బిల్లులు చెల్లించక పోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోందన్నారు. ప్రభుత్వం ఇలాగే చేస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని, ఇకనైనా పెన్షనర్లను మానసిక క్షోభకు గురిచేయకుండా వెంటనే దాచుకున్న డబ్బులను చెల్లించాలని కోరారు.

హ్యాపీ న్యూ ఇయర్

- కొత్త సంవత్సరం సంబురాల్లో యువత
- అర్ధరాత్రి 12 గంటలకు కేక్‌కట్ చేసిన ప్రజలు
- డీసీపీ పర్యవేక్షణలో పోలీసుల బందోబస్తు





జనగామలో కేక్‌కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్న యువతులు, చిన్నారులు

జనగామ: కదిలే కాలమా.. కాసేపు ఆగవమ్మా.. అంటూ గొంతెత్తి అడిగినా వినిపించుకోలేదు. ఎందుకంటే క్షణాలు వడివడిగా కరిగి పోవడం కాలధర్మం. అలా కరిగిపోయిన ప్రతీ క్షణాన్ని ఒక జ్ఞాపకంగా మిగుల్చుకోవడం మానవ నైజం. ఎన్నో తీపి గుర్తులు, చేదు అనుభవాల నడుమ 2024 చరిత్ర పుటల్లో కలిసి పోయింది. చీకటి నుంచి వెలుగు వైపు పరుగులు తీస్తూ, కోటి ఆశల నవ వసంతం కొత్త పేజీలు తెరుచుకున్నాయి. అర్ధరాత్రి 12 గంటలకు 2025 ఆంగ్ల సంవత్సరానికి జిల్లా ప్రజలు ఘన స్వాగతం పలికారు. స్నేహమాధుర్యాన్ని పంచుకుంటూ నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

అంబురాన్నంటిన సంబురాలు

నూతన సంవత్సర స్వాగత సంబురాలు అంబురాన్నంటాయి. 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ యువత కేక పుట్టించింది. బేకరీల వద్ద మంగళవారం కొనుగోలుదారులతో సందడి నెలకొంది. ఆర్టీసీ చౌరస్తాతో పాటు నెహ్రూపార్కు, రైల్వేస్టేషన్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా ప్రజలు కేక్‌లను కట్ చేసి నూతన సంవత్సరానికి వెల్ కం చెప్పారు. జిల్లాలో రూ.20 లక్షలకు పైగా కేక్‌లు అమ్ముడుపోయాయి. కాగా రోడ్డు ప్రమాదాలు, గొడవలు, ర్యాష్ డ్రైవింగ్‌ను నివారించేందుకు డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆధ్వర్యంలో వెస్ట్‌జోన్ పరిధిలో ఏసీపీ పార్థసారథి, సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సైలు చెన్నకేశవులు, రాజేష్, రాజన్‌బాబు, శ్వేత ఆధ్వర్యంలో అడుగడుగునా తనిఖీలను చేపట్టారు.



అట్టహాసంగా అథ్లెటిక్స్, రెజ్లింగ్ క్రీడోత్సవాలు

● ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సీఎం కప్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్, రెజ్లింగ్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడోత్సవాలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలకు హనుమకొండ కేంద్ర బిందువుగా నిలుస్తోందన్నారు. ప్రతిభ కనబరిచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీ వరకు జరిగే పోటీలకు వివిధ జిల్లాల నుంచి 2 వేల మంది క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎండీ. అజీజ్‌ఖాన్, అథ్లెటిక్స్ సంఘం జిల్లా చైర్మన్ వరద రాజేశ్వర్‌రావు, రెజ్లింగ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ కరీం, కోచ్‌లు నరేందర్, శ్రీమన్నారాయణ, కందికొండ రాజు, బొడ్డు విష్ణువర్ధన్, ఓనపాకల శంకర్, కూరపాటి రమేశ్, కె.ప్రశాంత్ పాల్గొన్నారు.


లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారిణి

నేటినుంచి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేళల్లో మార్పులు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే పలు రైళ్ల వేళలను 2025 జనవరి 1వ తేదీ నుంచి మార్చి నడిపిస్తున్నట్లు కాజీపేట రైల్వే చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ అధికారులు మంగళవారం రాత్రి తెలిపారు.

కాజీపేట మీదుగా వెళ్లే.. మారిన రైళ్ల వేళలు

హైదరాబాద్–గోరఖ్‌పూర్ (07075) గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి శుక్రవారం 23.23 గంటలకు వచ్చి 23.25 గంటలకు వెళ్తుంది. సికింద్రాబాద్–దర్బాంగా (17007) ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధ, ఆదివారాల్లో 00.33 గంటలకు చేరుకుని 00.35 గంటలకు వెళ్తుంది. సికింద్రాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (17011) కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు 07.08 గంటలకు చేరుకుని 07.10 గంటలకు వెళ్తుంది. యశ్వంత్‌పూర్–జబల్‌పూర్ (12193) జబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ సోమవారం 05.48 గంటలకు చేరుకుని 05.50 గంటలకు వెళ్తుంది. సికింద్రాబాద్–నిజాముద్దీన్ (12437) ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారం 14.38 గంటలకు చేరుకుని 14.40 గంటలకు వెళ్తుంది. హైదరాబాద్–న్యూఢిల్లీ (12723) తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు 07.58 గంటలకు చేరుకుని 08.00 గంటలకు వెళ్తుంది. తాంబరం–హైదరాబాద్ (12759) తాంబరం ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు 04.33 గంటలకు చేరుకుని 04.35 గంటలకు వెళ్తుంది. సికింద్రాబాద్–రాయ్‌పూర్ (12771) రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ మంగళ, గురు, శనివారాల్లో 00.33 గంటలకు చేరుకుని 00.35 గంటలకు వెళ్తుంది. నాగర్‌సోల్–నర్సాపూర్ (12788) నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ సోమ, బుధ, గురు, శుక్ర, శనివారాల్లో 01.49 గంటలకు చేరుకుని 01.50 గంటలకు వెళ్తుంది. గోరఖ్‌పూర్–హైదరాబాద్ (07076) గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ సోమవారం 13.15 గంటలకు చేరుకుని 13.17 గంటలకు వెళ్తుంది. సికింద్రాబాద్–గుంటూరు (17202) గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు 14.48 గంటలకు చేరుకుని 14.50 గంటలకు వెళ్తుంది. కాకినాడ–సాయినగర్ (17206) సాయినగర్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ సోమ, బుధ, శనివారాల్లో 12.58 గంటలకు చేరుకుని 13.00 గంటలకు వెళ్తుంది. మచిలీపట్నం–షిర్డీ సాయినగర్ (17208) సాయినగర్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ మంగళవారం 12.58 గంటలకు చేరుకుని 13.00 గంటలకు వెళ్తుంది. సికింద్రాబాద్–భద్రాచలం రోడ్ (17659) కాకతీయ ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు 19.48 గంటలకు చేరుకుని 19.50 గంటలకు వెళ్తుంది. భద్రాచలం రోడ్–సికింద్రాబాద్ (17660) కాకతీయ ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు 07.43 గంటలకు చేరుకుని 07.45 గంటలకు వెళ్తుంది. లోకమాన్యతిలక్ టెర్మినల్–విశాఖపట్నం (18520) లోకమాన్యతిలక్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు 21.43 గంటలకు చేరుకుని 21.45 గంటలకు వెళ్తుంది. సంబల్‌పూర్–నాందేడ్ (20809) సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ సోమ, మంగళ, ఆదివారాల్లో 04.43 గంటలకు చేరుకుని 04.45 గంటలకు వెళ్తుంది. విశాఖపట్నం–నాందేడ్ (20811) నాందేడ్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధ, గురు, ఆదివారాల్లో 04.43 గంటలకు చేరుకుని 04.45 గంటలకు వెళ్తుంది. కాజీపేట–పూణె (22152) పూణె ఎక్స్‌ప్రెస్ ప్రతీ ఆదివారం కాజీపేట నుంచి 13.25 గంటలకు బయలుదేరి వెళ్తుంది.

సమగ్ర శిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన

జనగామ రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 22వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు తాళ్లతో చేతులను కట్టేసుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూరి రమేశ్ మాట్లాడుతూ పాలకుల చేతిలో బందీలుగా ఉంటూ వెట్టి చాకిరి చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బైరగోని దయాకర్, మహిళా అధ్యక్షురాలు శ్రీలత, కోశాధికారి గోలి రవీందర్ రెడ్డి, రాణి, అన్నపూర్ణ, కవిత, సంధ్య, వెంకటేశ్వర్లు, రాజు, జ్ఞానానందం, రమ్య తదితరులు పాల్గొన్నారు.


తాళ్లతో చేతులను కట్టేసుకుని నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

జిల్లా సమగ్రాభివృద్ధికి పోరాటం

● సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

జనగామ రూరల్: జిల్లా సమగ్రాభివృద్ధికి సీపీఎం విస్తృత పోరాటాలు చేస్తుందని జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని, నీటి వనరుల ప్రాజెక్టు పూర్తి చేసి విద్యా వైద్యం అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధిలో పని దినాలు పెంచి రోజుకు రూ.600 ఇవ్వాలన్నారు. అనంతరం 25 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, ఇర్రి అహల్య, రాపర్తి సోమయ్య, బోట్ల శేఖర్, కమిటీ సభ్యులు జోగు ప్రకాష్, సుంచు విజేందర్, భూక్య చందు, పొత్కనూరి ఉపేందర్ మునిగల రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కనకారెడ్డి

డ్రం సీడర్ సాగుపై అవగాహన

● వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రామారావు

పాలకుర్తి టౌన్: వరిలో అధిక దిగుబడులు సాధించేందుకు డ్రం సీడర్ సాగుతో పాటు వెదజల్లే పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రామారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు గోపి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ పాలకుర్తి డివిజన్ ఏడీఏ పరశురాంనాయక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలో సస్యరక్షణ చర్యలను చేపట్టే విధంగా రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి, కొడకండ్ల వ్యవసాయ శాఖ అధికారులు శరత్ చంద్ర, విజయ్‌రెడ్డి, ఏఈఓలు రాధిక, లక్ష్మి, ప్రవళిక, దీపక్, కీర్తి, మహేష్, స్నేహ, సంతోష్ పాల్గొన్నారు.


వీసీలో పాల్గొన్న డీఏఓ రామారావు, అధికారులు

కలెక్టర్‌ను కలిసిన హౌసింగ్ పీడీ

జనగామ: జిల్లాకు కొత్తగా వచ్చిన గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ)గా మత్రునాయక్ మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాషాను మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



తగ్గిన కేసులు..

● పెరిగిన చలాన్లు, డ్రంకెన్ డ్రైవ్ కేసులు

● వివరాలు వెల్లడించిన డీసీపీ రాజమహేంద్రనాయక్

జనగామ: 2023 సంవత్సరంతో పోలిస్తే, 2024లో కేసులు, మర్డర్లు, చోరీలు, ఎస్సీ ఎస్టీ, మహిళలపై వేధింపులు తగ్గగా... గేమింగ్ యాక్టు, ఇసుక అక్రమ రవాణా, చలాన్లు, డ్రంకెన్ డ్రైవ్, గంజాయి కేసులు, రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. ఈ మేరకు మంగళవారం 2024 సంవత్సరానికి సంబంధించిన కేసుల వివరాలను డీసీపీ రాజమహేంద్రనాయక్ వెల్లడించారు. 2024 సంవత్సరంలో వెస్ట్‌జోన్ పరిధిలో 3,306 కేసులు నమోదు చేశారు. 2023 ఏడాదితో పోలిస్తే 5 శాతం తగ్గాయి. 2023లో 312 రోడ్డు ప్రమాదాలు జరుగగా, 141 మంది చనిపోయారు. 2024లో 331 రోడ్డు ప్రమాదాల్లో 161 మంది మృత్యువాతపడ్డారు. గతేడాది చలాన్ల రూపంలో పోలీసు శాఖకు రూ.67లక్షల మేర జరిమానా రూపంలో తీసుకున్నారు. 2024లో శాంతిభద్రతల పరిరక్షణలో మెరుగైన ఫలితాలు సాధించిన పోలీసు శాఖ.. 2025 న్యూ ఇయర్‌లో అంతకుమించి విజయం సాధించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు.